

16న అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రంలోని విటి అగ్రహారంలోగల ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 16న ఉదయం 9గంటల నుంచి ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. ఐటిఐ పాసైన వారంతా ఈ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. వరుణ్ మోటార్స్ ప్రైవేటు లిమిటెడ్, జయభేరి ఆటోమోటివ్ లిమిటెడ్, ఇన్నోవా సోర్స్, క్యూసివ్ టెక్నాలజి ప్రైవేట్ లిమిటెడ్, భగవతి ప్రొడక్షన్ ప్రైవేటు లిమిటెడ్, ఆర్వి మోటార్స్, జెవై సొల్యూషన్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్, హెట్రో డ్రగ్స్ నక్కపల్లి, కళ ఫుడ్ ప్రొడక్ట్ లిమిటెడ్ తదితర కంపెనీలను ఆహ్వానించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమల్లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, 2ఫొటోలతో పాటు కావాలని తెలిపారు. వివరాలకు ఫోను నెంబర్లు 9849118075, 9849944654ను సంప్రదించాలని తెలిపారు.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద



- ఆర్థిక ఇబ్బందుల నడుమ పెద్దపండగ
- అప్పుచేసి పిండివంటకాలు
- పల్లెకు చేరిన వలసజీవులు, ఉద్యోగ, వ్యాపారులు
- కనుమరుగవుతున్న నాటి సంస్కృతీ సంప్రదాయాలు

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద... సరదాలు తెచ్చిందే తుమ్మెద... కొత్త ధాన్యాలతో... కోడి పందేలతో... ఊరేగిపొంగుతుంటే... అంటూ సరదాల సంక్రాంతిని వర్ణించాడో కవి. అందుకు తగ్గట్టే నేటి సంక్రాంతి వేళ పల్లెలన్నీ ముస్తాబవుతున్నాయి. సంక్రాంతి అనగానే పల్లెటూరి వాతావరణం కళ్ల ముందు కదలాడుతోంది. మట్టికి, మనిషికి ఉన్న అన్యోన్య బంధాన్ని గుర్తు చేస్తుంది. అందుకు తగ్గట్టే జనం పుట్టిపెరిగిన ఊళ్లకు పరుగు పరుగున చేరుకుంటున్నారు. కానీ, పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, పెరగని వేతనాలు, గిట్టుబాటుకు నోచుకోని వ్యవసాయ ఉత్పత్తుల ధరల వల్ల ఆర్థిక ఇబ్బందుల నడుమ సక్రాంతి పండగ జరుపుకోవాల్సివస్తోందంటూ జనం పెదవి విరిస్తున్నారు. అయినాసరే...! సంక్రాంతిపూట ఇంటిళ్లపాదీ సరదాగా గడిపేందుకు వచ్చిన జనంతో పల్లెసీమలు కళకళాడుతున్నాయి.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సంక్రాంతికి నెలరోజుల ముందే.... అంటే నెలగంటు పెట్టినప్పటి నుంచీ రోజూ క్రమం తప్పకుండా ఇళ్ల అలుక్కోవడం (శుభ్రం చేసుకోవడం), సున్నాలు వేసి ప్రత్యేకంగా ముస్తాబు చేయడం వంటి పనులు ప్రారంభిస్తారు. రకరకాల పూలు, రంగులతో ఇళ్ల ముందు వేసిన ముగ్గులు హరివిల్లును తలపించేవి. గొబ్బెమ్మలు పెడుతూ యువతంతా ఆటపాటలతో అలికిరి చేసేవారు. బుడబుక్కలవాళ్లు, హరిదాసులు, కొమ్మ దాసులు, జంగం దేవర్లు.... కళలను ప్రదర్శించేవారు. పండగకు కొద్దిరోజుల ముందు నుంచే పిండి వంటకాలు ఘుమఘుమలాడేవి. కొత్తబట్టలు, కిరాణా సామగ్రి తదితర సరుకుల క్రయ విక్రయాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కళకళలాడేది. బట్టల వ్యాపారులు సైకిళ్లపై గ్రామాల్లో తిరిగి విక్రయించేవారు. ఇలా గ్రామసీమలు కళకళలాడేవి. ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మారుతున్న పరిస్థితులు నాటి సంస్కృతి సంప్రదాయాలను కనుమరుగు చేస్తున్నాయి. ఏటా పండగ తీరు మారుతుండడమే ఇందుకు నిదర్శనం.

ప్రస్తుతం సంక్రాంతి అంటే కేవలం కొత్తబట్టలు, నగలు, సెల్‌ఫోన్లు వంటి వివిధ రకాల వస్తువులు కొనుక్కునే పండగ్గా మారిపోయింది. మరో మాటలో చెప్పాలంటే నాటి సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. గతంలో పల్లెటూళ్లలోనే ఇంటిళ్లపాదీ కూర్చొని తీరిగ్గా తీసే బట్టలు నేడు పట్టణాల్లో షాపింగ్‌మాల్స్‌కు పరిమిత మవుతున్నారు. గ్లోబలైజేషన్ ప్రభావంతో అందరూ 'సెల్'కు బంధీలవుతున్నారు. భోగి మంటల్లో కాల్చే పిడకల నుంచి ఆరగించే అరిసెల వరకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసే స్థాయికి పడిపోయాం. ప్రకృతితో మమేకమయ్యే పరిస్థితిని చేజేతులా కోల్పోతున్నాం. ఆలింగనం, కరచాలనం, ఆత్మీయ పలకరింపు కూడా ఉండడం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది.

పండగలు... ఉత్సవాలు... జాతరలు... మానవ సంస్కృతిలో భాగం. కొన్ని పండగలు ఉత్పత్తితో ముడిపడి ఉంటాయి. మరికొన్ని ప్రకృతిపై మానవుడు సాధించిన విజయాలకు చిహ్నంగా నిలుస్తాయి. ఇంకొన్ని పూర్తిగా కుల, మత నమ్మకాలపై ఆధారపడి ఉంటాయి. ఇందులో మొదటి కోవకు చెందిందే సంక్రాంతి పండగ. జిల్లాలోని 80శాతం కుటుంబాలు వ్యవసాయంతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ముడిపడి ఉన్నవే. ఈ ఏడాది మునుపెన్నడూ లేనంతగా వరిసాగైనప్పటికీ, పెరిగిన విత్తన, పురుగు మందులు, ఎరువుల ధరలకు తగ్గట్టుగా ధాన్యం ధరను పెంచలేదు. దీనికితోడు నవంబరులో కురిసిన వర్షాలు పెట్టుబడిని మరికొంత పెంచేశాయి. ఇంకొందరికి ఏకంగా నష్టం చేకూరింది. దీంతో, రైతు కుటుంబాలన్నీ తీవ్ర నష్టాలను చవిచూశాయి. ఫలితంగా వ్యవసాయంపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులకు, వృత్తిదారులకు ఆశించిన ఉపాధి దొరకలేదు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగానే ఏర్పాటు చేశారు. దళారుల రంగ ప్రవేశంతో ప్రభుత్వం పెంచిన అరకొర ధర కూడా అమలు కాని దుస్థితి దాపురించింది. దీంతో, తీవ్ర రైతులు ఆవేదన చెందుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పండగ ముందు కొన్ని నగదు బదిలీ పథకాల డబ్బులు ప్రజల ఖాతాల్లో జమ అయ్యేవి. అంతకు ముందు చంద్రన్న కానుక పేరిట నూనె, నెయ్యి, కందిపప్పు, పంచదార, బెల్లం తదితర ఏడు రకాల సరుకులు ఇచ్చేవారు. ఫలితంగా పండగలో కాస్తంత ఉపసమనం ఉండేది. ఈసారి అటువంటివేవీ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల నడుమ సంక్రాంతి సంబరాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో సుమారు 500లకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పనిచేసే కార్యకర్తలు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీలకు ఈనెల 2 లేదా 3వ తేదీల్లో అందాల్సిన వేతనాలు ఇప్పటికీ పడలేదు. దీంతో, తామంతా పండగంటి పూట పప్పన్నం తినలేని పరిస్థితి ఎదురైందని వాపోతున్నారు.

కనుమరుగవుతున్న మానవ సంబంధాలు

మరోవైపు పండగలో ప్రజాసంస్కృతికి బదులు కార్పొరేట్ సంస్కృతి వచ్చేసింది. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ మానవ సంబంధాలు కనుమరుగువుతున్నాయి. గతంలో వారం రోజులు ముందుగానే సొంత ఊళ్లకు వెళ్లేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. పని ఒత్తిడి, ఉద్యోగులకు సెలవులు దొరక్కపోవడం, విద్యార్థులకు స్పెషల్ కోచింగ్ వంటి కారణాల వల్ల చివరి క్షణాల్లో తప్పక వెళ్తున్నారు. కొద్దిమందికి అది కూడా సాధ్యం కాక పండక్కి దూరమౌతున్నారు.



గంగిరెద్దుతో విన్యాసాలు చేయిస్తున్న వ్యక్తి

గిరిజన బాలిక ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం : గిరిజన బాలిక ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని లోవముత్తా ప్రాంతంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గుమ్మలక్ష్మీపురం మండలం జర్న గ్రామానికి చెందిన జీలకర్ర స్వాతి (16) తన ఇంటిలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్వాతిపై గతంలో బొబ్బిలిలో లైంగిక దాడి జరిగింది. ఈ విషయమై పార్వతీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే స్వాతి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఎల్విన్‌పేట ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



ఆత్మహత్య చేసుకున్న స్వాతి

నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, కమిషనర్ పి.నల్లనయ్య వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. అందరి జీవితాలలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. తెలుగువారి సంస్కతి సాంప్రదాయాలకు సంక్రాంతి రోజులు విశిష్టమైనవని అన్నారు. సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో అలరారాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.

మార్కెట్ కళకళ



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ఎంజి రోడ్డు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్/కోట

సంక్రాంతి పండగ నేపథ్యంలో సోమవారం నగరంలో మార్కెట్ కళకళలాడింది. వస్త్ర మార్కెట్‌తోపాటు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసే గంటస్తంభం మార్కెట్, కిరాణాషాపులు, వంట నూనె షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో ఎటు చూసినా ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. మార్కెట్‌లో అడుగుపెట్టాలంటే.. పెద్దచెరువు గట్టు, సత్యాలాడ్జి, రాజీవ్ క్రీడా మైదానం వద్ద వాహనాలు విడిచిపెట్టి లోపలికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా బుధవారం సంక్రాంతి నేపథ్యంలో పిండి వంటలకు అవసరమైన బెల్లం, పప్పులు, నూనె తదితర సామాగ్రి కొనుగోలు చేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో పిడబ్ల్యుమార్కెట్ కిక్కిరిసిపోయింది. మరోవైపు రహదారులపై చెరకు గడలు, ఎర్ర దుంపలు, బట్టలు కొనుగోలు చేసే వారంతా ఆయా ప్రాంతాలు ఖాళీ లేకుండా పోయాయి. ఎటు చూసినా కొనుగోలుదారులతో మార్కెట్ రద్దీ నెలకొనడంతో గంటల కొద్ది ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రైల్వేస్టేషన్‌రోడ్డు, ఎంజి రోడ్డు, ఉల్లివీధి, కన్యకాపరమేశ్వరి ఆలయం తదితర ప్రాంతాలు రద్దీగా మారాయి. దీంతో కొన్నిచోట్ల పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



పిండి వంటలకు బెల్లం కొనుగోలు చేసి తీసుకెళ్తున్న మహిళ

ఆనందోత్సాహాలతో భోగి

సంప్రదాయాలను కొనసాగించాలి
మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి -గజపతినగరం

భోగి పండగను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో నిర్వహించారు. వేకువ జాముకు ముందుగానే లేచి సేకరించిన దుంగలను కుప్పలుగా పోసి భోగి మంటలు వెలిగించారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పలు ప్రాంతాల్లో యువత పెద్దఎత్తున వీధుల్లో భోగి మంటలు వేశారు. చాలా చోట్ల చిన్నారులు భోగి మంటల్లో పిడకలు వేసి ఆనందంగా జరుపుకున్నారు.



పూర్వ విద్యార్థులు నిర్వహించిన భోగి సంబరాల్లో పాల్గొన్న మంత్రి కొండపల్లి

గజపతినగరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రతి ఏటా నిర్వహిస్తున్న భోగి సంబరాలు సాంప్రదాయాన్ని కొనసాగించాలని రాష్ట్ర సూక్ష్మ ,చిన్న, మధ్య తరహామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో పూర్వ విద్యార్థులు నిర్వహించిన భోగి సంబరాల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 20ఏళ్లగా అందరూ ఒకచోట కలుసుకుని భోగి సంబరాలు నిర్వహించడం మంచి సంప్రదాయం అన్నారు. ఇది భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంద న్నారు. ఈ సంబరాల్లో పాల్గొనేందుకు గజపతినగరం బడిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రతి ఏడాది దేశ, విదేశాల నుంచి కూడా రావడం ఎంతో ఆనందదాయకం అన్నారు. తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలుగువారి పండగల్లో ఎంతో విశిష్టమైన పండగ లో భోగి, సంక్రాంతి, కనుమ పండగలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గజపతినగరం హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రౌండ్ చుట్టూరా లైటింగ్ సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం మగ్రాపు వేణు మాస్టర్‌ను, వెటరన్ క్రికెటర్స్ పివివి గోపాల రాజు, రావి శ్రీధర్, కెఎన్ఎం శర్మ, తోనంగి శ్రీనివాసరావు, కర్రి నానాజీ, తంబి, కేఎన్‌బి విజయ్ కుమార్, కర్రి అప్పారావులను పూలమాలలు, దుశ్శావలతో మంత్రి కొండపల్లి చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పివివి గోపాలరాజు, మాజీ ఎంపిపిలు మక్కువ శ్రీధర్, కంది తిరుపతి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు రావి శ్రీధర్, వివిప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : నగరంలో భోగి సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. అన్ని వీధుల్లోనూ యువత, స్థానిక ప్రజలు పెద్దపెద్ద దుంగలు వేసి భోగి మంటలు వేశారు. చిన్నారులు పిడకలను మంటల్లో వేసి కేరింతలు కొట్టారు.

భోగిమంటల్లో విద్యుత్తు బిల్లులు దహనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. విజయనగరంలోని రామకృష్ణా నగర్, ఎల్‌బిజి నగర్, ముచ్చు వాణి చెరువుగట్టు , వైఎస్ఆర్ కాలేనీ తదితర ప్రాంతాల్లో ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని లేకపోతే భోగి మంటల్లో బిల్లులు కాలి పోయినట్టు, కూటమి ప్రభుత్వం ప్రజా ఆగ్రహంలో కొట్టుకుపోక తప్పదని హెచ్చరించారు. రూ.16,800 కోట్ల విద్యుత్తు భారాలు ప్రజలపై వేసి అదానికి స్మార్ట్ మీటర్లను కాంట్రాక్ట్ ఇచ్చి కోట్ల రూపాయలు ప్రజలు నుండి వసూలు చేయాలని నిర్ణయించారని, దాన్ని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, , బి.రమణ, జగదాంబ, శాంతమూర్తి, కృష్ణమ్మ బుచ్చయ్య, కానూరు రమణ తదితరులు పాల్గొన్నారు . వైఎస్ఆర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సురేష్, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని శ్రీనివాస కాలనీలో సిఐటియు ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్తు భారాలను తగ్గించాలని కోరుతూ విద్యుత్తు బిల్లులను భోగిమంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.17,989 కోట్లు భారం మోపడం టిడిపి కూటమి ప్రభుత్వానికి సరికాదన్నారు. కార్యక్రమంలో సరిపిల్లి కృష్ణవేణి, మద్దిల శైలజ, మద్దిల మనిషా, సరిపల్లి ప్రవీణ్, వి శ్రీకాంత్, జి నాగచైతన్య, వి శశికాంత్, మద్దిల భరత్ కుమార్, డి.వెంకటేష్ డి.గౌరి, రొంగలి దేవుడు, ఆర్.దేవి, లక్కోజు శ్రీను, ఎల్.వరం, సత్య పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని పురిటిపెంటలో విద్యుత్తు ఛార్జీల పెంపును నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు హరికృష్ణ వేణి, సిఐటియు నాయకులు జెర్రి రాము, గిరిజన సంఘ నాయకులు చిన్న రాయుడు, సతీష్, సత్యం, అసిరయ్య తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం ఎల్‌బిజి నగర్‌లో విద్యుత్తు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

జిల్లా వ్యాప్తంగా సిపిఎం నిరసనలు

బొబ్బిలి: పెరిగిన కరెంటు ఛార్జీలను రద్దు చేయాలని, దేవాంగుల వీధి భోగిమంటలో బిల్లును సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం దహనం చేశారు. సిపిఎం నాయకులు పి. శంకర్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి పెంచమని చెప్పిన చంద్రబాబు కరెంటు ఛార్జీలు భారీగా పెంచడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదానితో కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని తప్పు పట్టిన టిడిపి అవే మీటర్లు ప్రజల నెత్తి మీద పెట్టడం చూస్తుంటే పార్టీలు వేరైనా వీళ్ళిద్దరూ ఆదాని సేవకుల్లాగా కనిపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి పి రమణమ్మ, పోలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఎం.బూర్జవలస, రంగరాయపురంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన తెలిపారు. సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, సురేష్, కె.శంకర్, ప్రసాద్, మురళి, ప్రజలు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కేజీపూడి గ్రామంలో సోమవారం సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నెల్లిమర్ల: పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో జరజాపుపేటలో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, కాంగ్రెస్ నాయకులు కనకల పద్మ నాభం, మాత వెంకట రమణ పాల్గొన్నారు.

రేగిడి: పెరుగుతున్న కరెంటు ఛార్జీలు రద్దు చేయాలని మండలంలోని వునుకూరులో భోగి మంటలో బిల్లును దహనం చేశారు. సిపిఎం నాయకులు ఎం.త్రినాధ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి పెంచమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు కరెంటు ఛార్జీలను ఎలా పెంచుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి వి. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రామకృష్ణానగర్‌లో భోగి మంటల వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, స్థానికులు



ఎస్.కోటలో భోగి మంటల వద్ద నిరసన



బొబ్బిలి : మంటల్లో బిల్లులను దహనం చేస్తున్న నాయకులు





గజపతినగరం , వేపాడ మండలాల్లో విద్యుత్తు బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

అభివృద్ధికి ఆమడదూరంలో ఆతవ

●ఏకగ్రీవ పంచాయతీ అయినప్పటికీ ముందుకు కదలని పనులు ●అసంపూర్తిగానే సచివాలయ భవనం, రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామంలో సుమారు 1200 మంది ఓటర్లు, 3వేల మంది జనాభా ఉన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని అంతా కలిసి ఐక్యమత్యంగా ఏకగ్రీవంగా సర్పంచ్‌ను ఎన్నుకున్నా ఆయన గ్రామాభివృద్ధిని పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి ఇప్పుడు పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వంలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినప్పటికీ తరువాత వైసిపి హయాంలో ఏకగ్రీవ పంచాయతీ అయినప్పటికీ అభివృద్ధి వైపు అడుగులు పడలేదు. సర్పంచ్ కనీసం గ్రామ సచివాలయాన్ని కూడా పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ అసంపూర్తిగా ఉన్న భవనం పశువులకు నిలయంగా మారింది. ఆతవ జంక్షన్ నుంచి గ్రామంలోకి ఉన్న సుమారు రెండు కిలోమీటర్లు రోడ్డును బాగు చేస్తామని ఉన్న రోడ్డుని ఊడగొట్టి నేటికీ రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా రోడ్డు పనులు చేయలేదు. నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ ఆసుపత్రులకు దీంతో రాళ్లు తేలిపోయిన రోడ్డు మీద నిత్యం విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పూర్వం నిర్మించిన పంచాయతీ శిథిలావస్థకు చేరినా అందులోనే విధులు నిర్వహిస్తున్నారే తప్ప కొత్త భవనం నిర్మాణం చేపట్టలేదు. విద్యావంతులైన యువకులను గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని యువకులు మహిళలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆయన వారి ఆశలను అడియాశలు చేశారని పలువురు విమర్శిస్తున్నారు.


మధ్యలో నిలిచిపోయిన సచివాలయ నిర్మాణం

ప్రభుత్వం మారినా మారని పరిస్థితి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతైనా తమ గ్రామం అభివృద్ధి చెందుతుందేమోనన్న ఆశతో ఉన్న గ్రామస్తులకు టిడిపి రెండు గ్రూపులుగా ఏర్పడి అభివృద్ధిని గాలికి వదిలేశారు. ఇటీవల ఒక్కో గ్రూపునకు అభివృద్ధి కోసం రూ.5లక్షల చొప్పున నిధులు విడుదల చేసినా ఎవరూ పనులు ప్రారంభించలేదు. గత వైసిపి హయాంలో పడకేసిన బిల్లుల రాకపోవడంతో ఈ సారి కూడా అలాగే జరుగుతుందేమోనన్న భయంతో పని చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పెద్దలు, అధికారులు దృష్టి సారించి గ్రామానికి రోడ్డు నిర్మాణంతో పాటు అసంపూర్తిగా ఉన్నా సచివాలయ భవనాన్ని పూర్తి చేసి గ్రామాన్ని అభివృద్ధి వైపు అడుగులు వేసేలా కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రాళ్లు తేలిపోయిన రోడ్డు


జనంతో కిక్కిరిసిన మార్కెట్

మార్కెట్‌కు సంక్రాంతి శోభ

ప్రజాశక్తి-బొబ్బిలి

మార్కెట్‌కు సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంక్రాంతి బట్టలు, నిత్యావసర సరుకులు, చెప్పులు కొనుగోలు చేసేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో జనం రావడంతో సోమవారం మార్కెట్ జనంతో కిక్కిరిసింది. ఎన్‌టిఆర్ విగ్రహం జంక్షన్ నుంచి వేదరబంద జంక్షన్ వరకు రోడ్డు పొడవునా ఊక వేస్తే రాలనంత జనం ఉన్నారు. షాపులన్నీ జనంతో కిటకిటలాడాయి. వ్యాపారం బాగా జరగడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు గాలి పటాలు పంపిణీ

సంక్రాంతి సందర్భంగా గాలి పటాలు ఎగుర వేసేందుకు పిల్లలకు వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు గాలి పటాలు పంపిణీ చేశారు. టిఆర్ కాలనీలో పిల్లలకు గాలి పటాలు పంపిణీ చేసి ఎగుర వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.


పవన్‌తో మాట్లాడుతున్న నియోజకవర్గ జనసేన నాయకులు

పవన్‌ను కలిసిన భోగాపురం నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను నియోజకవర్గ జనసేన నాయకులు మంగళగిరిలో కలిశారు. ఆ పార్టీ నాయకులు లోకం ప్రసాద్ ఆధ్వర్యంలో వీరంతా వెళ్లి ఆయన్ను కలిసి నామినేటెడ్ పోస్టులపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో పదవులు ఆశించే వారంతా వెళ్లి కలిసినట్లు తెలుస్తోంది. పవన్‌ను కలిసిన వారిలో సీనియర్ నాయకులు కార్లపూడి శ్రీనివాసరాజు, చనుమల్ల వెంకటరమణ, సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి, కొవ్వాడ రఘు, చెల్లిబోయిన నర్సింగ్ రావు, బాల అప్పలరాజు, పల్లంట్ల జగదీష్ తదితరులు ఉన్నారు.

కల్వర్టు నిర్మించండి

ప్రజాశక్తి - వేపాడ

కూలిపోయిన బల్లంకి కల్వర్టును నిర్మించాలని ఆ గ్రామ సర్పంచ్ బల్లంకి లక్ష్మి కోరారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన మరిడిమాంబ జాతర జరగనున్న నేపథ్యంలో పరిసర 9 గ్రామాల నుంచి రావాల్సిన వారు కల్వర్టు కూలిపోవడంతో ఇబ్బందులు పడే అవకాశం ఉందని అన్నారు. అధికారులు స్పందించి జాతరకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని విశాఖ నగరపాలక జివిఎంసి అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను కోరారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ దేవి

జాతర్ల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది, బల్లంకి, మైచర్ల సింగవరం, కృష్ణరాయుడుపేట గ్రామాల్లో జరగనున్న జాతర్లపై ఎస్‌ఐ బి. దేవి సోమవారం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో జాతర సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలు, కోడి పందేలు, పొట్టేలు పందేలు, పేకాట నిర్వహించకూడదని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొగ మంచుతో మామిడి పూతకు ముప్పు

ప్రజాశక్తి - వేపాడ

గత ఐదు రోజులుగా దట్టంగా కురుస్తున్న పొగ మంచు వల్ల ఇప్పుడిప్పుడే పూస్తున్న మామిడి పూత మాడిపోతుంది. ఉదయం 8 గంటల వరకు వర్షాన్ని తలపించేలా కురుస్తున్న పొగ మంచుతో మామిడి పూత మాడిపోయి రాలిపోతుందని రైతులు వాపోతున్నారు. దీని వల్ల ఈ ఏడాది దిగుబడి కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. కేజీ పూడి, జాకేరు, కరకవలస, గుడివాడ, దబ్బిరాజుపేట, వేపాడ, వీలుపరితి, వావిలపాడు, నల్లబెల్లి, గుడిపాల, బల్లంకి, బానాది, కెఆర్‌పేట, కొంపల్లి, ఆతవ గ్రామాలలో 2,230 హెక్టార్లలో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. పువ్వు పింజే దశలో విపరీతమైన పొగ మంచు పడడం వల్ల పూసిన పూత రాలిపోవడం, మాడిపోవడం జరుగుతుందని, గత డిసెంబర్‌లో పడిన వర్షాల వల్ల మామిడి పంటకు నష్టం కలిగిందని ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మామిడి తోటలపై మంచు దెబ్బ పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దట్టంగా కురుస్తున్న పొగమంచు

మూడు రోజుల ముచ్చటే

● తూతూ మంత్రంగా రహదారి మరమ్మతులు ● గుంతల రోడ్లే దర్శనం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వం చేపట్టిన రహదారి మరమ్మతుల పనులు మూడు రోజులు ముచ్చటగానే కనిపిస్తున్నాయి. తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడంతో ఎక్కడికక్కడ మళ్లీ గోతుల రోడ్లే దర్శనమిస్తున్నాయి. స్థానిక మొయిద జంక్షన్ నుంచి జరజాపు పేట వెళ్లే రహదారిలో రోడ్లు భవనాల శాఖ మరమ్మతులు చేపట్టి గోతులు కప్పింది. అయితే మరమ్మతులు చేపట్టిన మూడు రోజులకే రాయి, పిక్క తేలి గోతులు తిరిగి ఏర్పడ్డాయి. గతంలో గోతులు ఉన్నప్పుడు వాహనదార్లు, పాదాచారుల చూసుకొని వెళ్లేవారు ప్రస్తుతం రహదారి మరమ్మత్తులు చేపట్టిన తరువాత కూడా గోతులు తేలడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో గోతులు తేలిన రహదారులను కూడా వైసిపి ప్రభుత్వం పూడ్చలేకపోయిందని ఎద్దేవ చేసిన ఇప్పటి కూటమి ప్రభుత్వం హుటాహుటిన రహదార్ల మరమ్మతులు చేపట్టి సంక్రాతిలోగా గోతులు లేకుండా చేస్తామని చెప్పినప్పటికీ తూతూ మంత్రంగా చేయడంతో అదే గుంతల రోడ్లపైనే సంక్రాంతి పండగకు ప్రయాణం చేయాల్సి వస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు. రహదారి మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు గోతుల్లో బుగ్గి, చిన్న పిక్కలు వేసి మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతుల్లో వేసిన రాయి, బుగ్గి, పిక్క తేలిపోవడంతో తిరిగి గోతులు దర్శనమిస్తున్నాయి. మరమ్మతు పనుల్లో రహదారి, భవనాల శాఖ అధికార్లు పర్యవేక్షణ లేకపోవడం కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినవస్తున్నాయి. నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్ల పై చర్యలు తీసుకొని గోతులు లేని రహదార్లు వేయాలని పలువురు కోరుతున్నారు.


గోతులతో దర్శనమిస్తున్న రోడ్డు

పేదలకు సంక్రాంతి కానుకలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి వర్జాన ఆది బాబు తన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం 100 మంది పేదలకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ 10 కిలోల బియ్యం, శనగపప్పు, బెల్లం, నూనె అందజేశారు. గ్రామంలో పేదలకు ఏటా సంక్రాంతికి ఈ కానుకలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు మెంబర్ ఒమ్మి పైడిపల్లి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


డెంకాడ: కానుకలను పంపిణీ చేస్తున్న ఆదిబాబు

బాడంగి: మండలంలోని గజరాయునివలసలో భోగి, సంక్రాంతి పండగ సందర్భంగా ఆ గ్రామ ఎంపిటిసి, టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరీ ఆధ్వర్యంలో మేలుకొలుపు సభ్యుల ద్వారా వచ్చిన దుస్తులు, బియ్యాన్ని సోమవారం వృద్ధులకు, పేదలకు పంపిణీ చేశారు. ఏటా పేదలకు దుస్తులు, బియ్యం పంపిణీ చేస్తున్నామని గౌరు తెలిపారు.


దుస్తులను పంపిణీ చేస్తున్న గౌరు

భోగాపురం: భోగాపురం మాజీ జెడ్‌పిటిసి పడాల రాజేశ్వరి, భర్త శ్రీనివాసరావు పేద మహిళలకు సోమవారం భోగాపు రంలో చీరలను పంపిణీ చేశారు. భోగి సందర్భంగా ఏటా చీరలు పంపిణీ చేస్తుంటామని పడాల శ్రీనివాసరావు తెలిపారు. 500 మంది మహిళలకు చీరలు, 150 మంది పురుషులకు పంచలను పంపిణీ చేశారు.

అభివృద్ధిపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆమె కలెక్టర్‌ను కలిసి మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఈ నెల 17 కలెక్టర్ పర్యటించనున్నారని అన్నారు. ఎస్‌కోటలోని రేగ పుణ్యగిరి, ఇతర గిరిజనుల ప్రాంతాల్లోని గిరిజనుల డోలీ సమస్యలను పరిష్కరించాలని గత అసెంబ్లీ సమావేశాలలో డోలి మోతల సమస్యల గురించి అసెంబ్లీలో లేవనెత్తిన విషయం కలెక్టర్‌కి చెప్పామన్నారు. ఉపాధి హామీ నిధులను కేటాయించి డోలి మోత సమస్యలను త్వరగా పరిష్కారించాలని కోరామన్నారు. కలెక్టర్ సమస్యలన్నీ విని సానుకూలంగా స్పందించి ఈ నెల 17 నియోజకవర్గంలో పర్యటిస్తామన్నారని చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చింతలపాలెం సర్పంచ్ మాకేన నవీన్ పాత్రుడు ఉన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

జూనియర్ సైంటిస్ట్‌గా కిరణ్‌కుమార్

బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్‌లో ఉద్యోగానికి ఎంపిక

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన యువకుడు అరసవిల్లి కిరణ్ కుమార్ అరుదైన ఘనత సాధించారు. ముంబైలోని భారత్ అణు పరిశోధన కేంద్రం తాజాగా నిర్వహించిన ఉద్యోగ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సదరు సంస్థలో జూనియర్ సైంటిస్ట్‌గా ఎంపికయ్యారు. తాజాగా నిర్వహించిన రాత పరీక్షలో ఆలిండియాలో 12వ ర్యాంక్ సాధించారు. సదరు ఉద్యోగ ఇంటర్వ్యూలో 48వ ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్‌లో గ్రూపు బి గెజిటెడ్ అధికారిగా ఉద్యోగం సాధించారు. కిరణ్ కుమార్ తండ్రి అరసవల్లి రామకృష్ణ నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మ గృహిణి. కిరణ్ కుమార్ ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకూ నెల్లిమర్ల శ్రీఆదిత్య పబ్లిక్ స్కూల్లో చదివారు. విశాఖపట్నం జిల్లా కొమ్మాదిలోని శ్రీ చైతన్య కళాశాలలో పాలిటెక్నిక్ విద్యనభ్యసించారు. డెంకాడ మండలం లెండి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ పూర్తి చేశారు. ఆయన అణు పరీక్ష కేంద్రంలో ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నేరాలు ఘోరాలు

16 మంది జూదగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గొలగాం, చొల్లంగిపేట గ్రామాల్లో 16 మంది జూదగాళ్లను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. గొలగాంలో పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుంచి రూ.15100 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు. చొల్లంగిపేట గ్రామంలో రచ్చబండ వద్ద 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5250 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని చెప్పారు.


బహుమతులను అందజేస్తున్న కడగల ఆనంద్‌కుమార్

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

క్రీడలతో మానసికొల్లాసం కలుగుతోందని యువత సెల్‌ఫోన్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని టిడిపి మండల అధ్యక్షులు, ఎయిమ్స్ విద్యా సంస్థల అధినేత కడగల ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని అలుగోలు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కడగల తమ్మినాయుడు మెమోరియల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జిల్లా స్థాయి షటిల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలతో పాటు చదువులపై దృష్టి పెట్టి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ఐదు జట్లు పాల్గొనగా ప్రథమ స్థానం రణస్థలం, ద్వితీయ అలుగోలు, తృతీయ స్థానాన్ని విజయనగరం జట్లు కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దివాకర్, కెల్ల నారాయణప్పలనాయుడు, యువత తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన డ్యాన్స్ పోటీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సంక్రాంతి సంబరాలలో భాగంగా ఎం.బూర్జవలసలో సోమవారం నిర్వహించిన డ్యాన్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలలో వివిధ సినిమా పాటలకు డ్యాన్సులు చేసేందుకు చిన్నారులు, యువత ఆసక్తి చూపారు. డ్యాన్సులతో ప్రజలను అలరించారు. విజేతలకు సంక్రాంతి సందర్భంగా నేడు బహుమతులు అందజేస్తామని నిర్వహకులు రమేష్, శ్రీను, గణేష్, గ్రామపెద్దలు తెలిపారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని గురువాం గ్రామంలో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి ఎమ్మెల్యే మండలంలోని దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పూలదండలు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధాలతో సాధించలేనిది, కేవలం జ్ఞానంతో రాజ్యాంగాన్ని సాధించిన మొదటి వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. అణచివేత, చిన్నచూపునకు గురైనా అంబేద్కర్ ప్రపంచ దేశాలకు వెళ్లి ఎవరూ సాధించలేని ఉన్నత చదువులు చదివి భారతదేశానికి వచ్చి రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాల మన్ననలు పొందారన్నారు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని, నిరంతరం జ్ఞానం కోసం శ్రమిస్తూ తాము తక్కువ కాదనే దృక్పదంలో ఉండాలన్నారు. ఏ వర్గమైనా అంబేద్కర్ జీవిత పాఠాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఈ దేశంలో ప్రతి వారికి కావాల్సిన వ్యక్తి అంబేద్కర్ అని, ఒక వర్గం, కులానికి కాదని, అందరి కోసం రాజ్యాంగాన్ని రచించిన మహా మేధావని కొనియాడారు. అనంతరం రాజాం మాదిగవీధికి చెందిన ఓ చిన్నారి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రి చికిత్స నిమిత్తం తన తండ్రి ఇలపండ అజయ్ కుమార్‌కు రూ.1,06,127 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసారు. సీఎం రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు సంజీవనిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు సుమల మన్మధరావు, గురువాన నారాయణరావు, పిన్నింటి మోహనరావు, దూబ ధర్మరావు, దుప్పలపూడి శ్రీను, లచ్చుబుక్త కృష్ణమూర్తి, పొన్నాడ భీమేశ్వరరావు, మజ్జి గణపతి, బవిరి శ్రీనుబాబు, యాగాటి రాము, జరజాన నీలయ్య, కేత శంకర్, బిల్లాన రమణ, జరజాన నితిన్, బిజెపి నాయకులు కోటగిరి నారాయణరావు, జనసేన నాయకులు యూపీ రాజు, గెడ్డపు నీలకంఠం, చిత్రరి నాగరాజు తదితరలు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీ


చెక్కును అందజేస్తున్న రమ, హెచ్‌ఎం

మెరిట్ విద్యార్థికి చెక్కు అందజేత

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి వీరసాగరం గ్రామానికి చెందిన పెంట శ్రీనివాసరావు విజయవాడలో ఆర్‌ఆర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ స్థాపించి ఉన్నత స్థానానికి వెళ్లాడు. అతని భార్య రమ సోమవారం పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరై తమ వంతుగా బాడంగి పాఠశాలలో పదోతరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన వారికి రూ.1,01,116 మెరిట్ స్టూడెంట్ అవార్డు చెక్కును ప్రధానోపాధ్యాయులు దత్తి సత్యన్నారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ శ్రీనివాసరావు లాగే ఇక్కడ చదివి ఉన్న స్థాయికి వెళ్ళిన ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి పాటు పడాలని ఈ సందర్భంగా కోరారు. శ్రీనివాసరావుని పలువురు పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రమేష్, రామారావు, లక్ష్మి ప్రజలు అభినందనలు తెలిపారు.

భోగభాగ్యాలతో వర్ధిల్లాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి- లక్కవరపుకోట

నియోజకవర్గ ప్రజలంతా భోగభాగ్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం సంక్రాంతి పర్వదినాన పురస్కరించుకొని మండల కేంద్రంలోని తన నివాస ప్రాంగణంలో భోగి పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు ఈ ఏడాది సుఖ సంతోషాలు, పాడిపంటలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు. కొత్త సంవత్సరం కొత్త ఆలోచనలతో అభివృద్ధి చెందాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు సంతోషంగా పండగ జరుపుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, మాజీ ఎంపిటిసి మల్లా రామకృష్ణ, కాసాపేట సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు, నీటి సంఘం అధ్యక్షులు పుట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌కోట: భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

బొబ్బిలి: పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి వీధిలో ఒక భోగి మంట వేశారు. యువకులు కర్రలు సేకరించి సోమవారం ఉదయం 5గంటల సమయంలో నిప్పు పెట్టి భోగి మంటలు వేశారు. భోగి మంటలలో చిన్నారులు పిడకల దండలు వేసి భోగి వేడుకలలో పాల్గొన్నారు.


బొబ్బిలి: భోగిమంట వద్ద సందడి చేస్తున్న యువత

దిష్టిబొమ్మల్లా అర్బన్ హెల్త్ సెంటర్లు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

నగరంలో నిర్మాణం జరిగిన ఏడు అర్బన్ హెల్త్ కేంద్రాలు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. ఎన్నికల ముందు కొన్ని ప్రారంభించినప్పటికీ నేటికీ ఆరోగ్య సేవలు అందించడం లేదు. ఎన్నికల ముందు విజయనగరంలోని 45వ డివిజన్ కెఎల్ పురంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హడావుడిగా ప్రారంభించారు. ఇక నుంచి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అందరూ భావించారు. కానీ అలా జరగలేదు. ఇప్పటికీ ఆ భవనానికి తాళాలు వేసే ఉన్నాయి. పశువులు, గొర్రెలకు, మద్యం తాగుబోతులకు నివాస ప్రాంతంగా మారింది. ఎన్నికల స్టంట్ కోసం హడావుడిగా అప్పటి వైసిపి పాలకులు ప్రారంభించారు తప్ప వైద్య సేవలకు నేటి వరకు నోచుకోలేదు. ఇప్పటికీ విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. నీటి సదుపాయం లేదు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రిడ్జి నిర్మాణం చేస్తుండటంతో అర్బన్ కేంద్రానికి వెళ్లేందుకు దారి కూడా లేదు. ఇక్కడ కొండ ప్రాంతం ఉండడంతో భూగర్భ జలాలు లేవు. దీంతో దూర ప్రాంతంలో బోరు వేసి, అక్కడి నుంచి పైపులైన్లు వేయాలి. కానీ ఆ పనులు నేటికీ జరగలేదు. మరో వైపు ధర్మపురి, బాబామెట్ట, వైఎస్ఆర్ నగర ప్రాంతాల్లో నిర్మించిన కేంద్రాలు కూడా దిష్టిబొమ్మల్లా ఉన్నాయి.

వైద్యానికి నోచుకోని పేదలు

ప్రభుత్వాలు మారాయి తప్ప అర్బన్ హెల్త్ కేంద్రాలు వినియోగంలోకి రాలేదు. ఒక్కొక్క అర్బన్ హెల్త్ కేంద్రం రూ.80 లక్షలతో నిర్మించారు. నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తేకపోవడం పట్ల విమర్శలువ్యక్తమవుతున్నాయి. వ్యాధులు ప్రబలుతున్న పరిస్థితుల్లో వినియోగంలోకి తీసుకొని రావాల్సిన అధికార యంత్రాంగం కళ్ళు అప్పగించి చూస్తోంది తప్ప ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చి నగర వాసులుకు వైద్య సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



కెఎల్‌పురంలో నిరుపయోగంగా ఉన్న హెల్త్ సెంటర్